క్లుప్తంగా

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



అడ్డాడ(పామర్రు): పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించినట్లు హైస్కూల్ హెచ్ఎం డి.పద్మ పేర్కొన్నారు. మండలంలోని అడ్డాడ జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో 2025 మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల స్థాయిలో 514 మార్కులు సాధించిన ఎం.తన్విత, 506 మార్కులు సాధించిన ఎస్.భార్గవి, 504 మార్కులు సాధించి కె.శిరిని సన్మానించినట్లు హెచ్ఎం తెలిపారు. వీరు అదే హైస్కూల్ ప్లస్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులలో జాయిన్ అయినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇంగ్లిష్‌లో 85/100 మార్కులు సాధించిన శివజ్యోతికి ఆంగ్ల ఉపాధ్యాయులు ప్రోత్సాహక బహుమతిని అందించారు. విద్యా కమిటీ చైర్మన్ జీ స్వప్న, వైస్ చైర్మన్ రాజేష్, హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తోట్లవల్లూరు: ఇళ్ల స్థలాల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో నివశించే వారికి మూడు సెంట్లు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన వారు సమీప గ్రామ సచివాలయాల్లో తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్‌కు సత్కారం



గుడివాడరూరల్: పోలీస్ డిపార్టుమెంట్‌లో వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించి నేడు ట్రాఫిక్ ఎస్ఐగా ఉద్యోగ విరమణ చేస్తున్న ప్రసాద్ మిగిలిన జీవితాన్ని ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో గడపాలని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గుడివాడ సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు ఉద్యోగ విరమణ చేస్తున్న గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ వివిధ హోదాల్లో 40 సంవత్సరాలుగా పోలీస్ డిపార్టుమెంట్‌లో సేవలు అందించిన ప్రసాద్ రిటైర్‌మెంట్ జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వన్, టూటౌన్, తాలూకా సీఐలు కొండపల్లి శ్రీనివాస్, చిన్ని నాగప్రసాద్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయం



తోట్లవల్లూరు: గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయమైనవని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఫస్ట్ ఎయిడ్ శిక్షణ పూర్తి చేసుకున్న గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. స్థానిక ఉమా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో గ్రామీణ వైద్యులకు తహసీల్దార్ సర్టిఫికెట్లను అందజేశారు. ఉయ్యూరు డివిజన్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తమ్మన ఉమామహేశ్వరరావు, కార్యదర్శి వేల్పూరి నాగమల్లేశ్వరరావు, జిల్లా కమిటీ ప్రతినిధులు బెజ్జంకి బ్రహ్మేశ్వరరావు, వల్లభాపురపు జగదీష్, కోదాడ ఏసునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టపై చెట్ల నరికివేతపై ఫిర్యాదు

నిడుమోలు(మొవ్వ): మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది చెరువు కట్టపై ఉన్న భారీ వృక్షాలను నరికి విక్రయించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన కొందరు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌తో కలిసి సోమవారం ఎంపీడీఓ జే విమాదేవికి ఫిర్యాదు చేశారు. బందర్‌రోడ్‌లో ఉన్న పొలాల మధ్యలో ఉన్న సాలె వాని చెరువు కట్టకు నాలుగు వైపులా 21 వేప చెట్లను, 15 తుమ్మ చెట్లు, 9 తెన్నేడు చెట్లు, 2 చీంతమ్మ చెట్లను గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొంతుపులి రాము, అతని కుమారుడు సురేష్, షరీఫ్ కలిసి నరికేశారని పేర్కొన్నారు. అనంతరం వాటిని ట్రాక్టర్ల ద్వారా తరలించారని ఫిర్యాదు చేశారు. కాగా దీనిపై పంచాయతీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోనికి తీసుకుని ఇన్‌చార్జి కార్యదర్శి ఆదేశానుసారం మేరుగు రాజేష్ నిర్వహించిన విచారణలో ఆ చెరువు కట్టపై 47 చెట్లను తరలించినట్లు తేలినట్లు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమరగిరి అంజలి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు డొక్కు వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచ్ మురళీ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారులు ఇసుకమయం

ప్రమాదాలబారిన వాహనదారులు



తోట్లవల్లూరు పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదబరితంగా రోడ్డుపై ఇసుక

తోట్లవల్లూరు: ఇసుక రవాణాతో రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఓవర్ లోడింగ్‌తో రోడ్లన్నీ ఇసుకమయమవుతున్నాయి. రోడ్లు, మార్జిన్లపై పేరుకుపోతున్న ఇసుకతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తోట్లవల్లూరు మండలంలోని నార్తువల్లూరు, రొయ్యూరు, కంకిపాడు మండలం మద్దూరు క్వారీల నుంచి కొన్ని నెలలుగా ఇసుక రవాణా జరుగుతోంది. ఆయా క్వారీల నుంచి అస్తవ్యస్తంగా సాగుతున్న ఇసుక రవాణాతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. నిబంధనలను గాలికొదిలేసి యథేచ్ఛగా లారీల్లో టన్నుల కొద్దీ ఇసుక భారీగా రవాణా చేస్తుండటంతో రోడ్లన్నీ ఇసుకతో నిండిపోతున్నాయి.

వాహనదారులకు అవస్థలు

లారీల్లో భారీగా ఇసుక లోడింగ్ చేయటం వలన మార్గమధ్యంలో కొంత జారి రోడ్లపై పడిపోతోంది. వందల కొద్దీ లారీల్లో నుంచి ఇసుక కింద పడిపోవటం వలన రోడ్లు, మార్జిన్లు ఇసుకతో నిండిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్లపై పేరుకుపోతున్న ఇసుకతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు.

అడ్డుకునే వారేరి?

లారీలలో ఇసుక ఓవర్ లోడింగ్ కారణంగానే రోడ్లన్నీ పాడైపోయి, అధ్వానంగా మారుతున్నాయి. ఇసుక రవాణ జరిగే కృష్ణా కరకట్ట, రొయ్యూరు–కంకిపాడు రహదారి, తోట్లవల్లూరు–ఉయ్యూరు రోడ్డు ప్రమాదబరితంగా మారాయి. లారీలలో ఓవర్ లోడింగ్‌ను అడ్డుకుని నియంత్రించాల్సిన రవాణ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవటంతో అక్రమార్కులు యథేచ్ఛగా తమ దందా సాగిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఓవర్ లోడింగ్‌ను నియంత్రించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భద్రిరాజుపాలెం మలుపు వద్ద ఇలా..

రోజూ ప్రమాదాలే



రోడ్లపై ఇసుక కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యాకమూరు బస్‌షెల్టర్ సమీపంలో రోజూ పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

– వల్లూరు శివనాగబాబు, యాకమూరు

ఎక్కడ చూసినా ఇసుకే



తోట్లవల్లూరు–ఉయ్యూరు ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ఎక్కడ చూసినా ఇసుక దర్శనమిస్తోంది. రోడ్డు మార్జిన్లు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంటోంది.

– గొరిపర్తి సూర్యనారాయణ, తోట్లవల్లూరు

ఇబ్బంది వాస్తవమే



రోడ్లపై జారిపోతున్న ఇసుకతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. లారీల్లో ఎక్కువ మొత్తంలో ఇసుక తరలించటంతో సమస్య తలెత్తుతోంది. దీనిపై ఇప్పటికే కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు, రవాణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్లికార్జున, ఏఈఈ, ఆర్అండ్‌బీ, ఉయ్యూరు

వృద్ధాశ్రమానికి వాటర్ ప్యూరిఫయర్ వితరణ

గుడివాడ టౌన్: బొగ్గారపు విజయ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు స్థానిక బేతవోలు శాంతి వృద్ధాశ్రమానికి రూ. 10 వేలు విలువగల వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ బొగ్గారపు తిరుపతయ్య – రాజ్యలక్ష్మి దంపతులు ఈ సందర్భంగా వృద్ధాశ్రమం వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షుడు పోకూరి మోహన్‌రావు, చింతపల్లి ప్రసాదు, రూప్‌చంద్ జైన్, బి. శ్రీనివాసరావు, మాచర్ల రామకృష్ణ, హారిక, జె. మునీంద్ర, అర్జున్ ప్రసాద్ పాల్గొన్నారు.



వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేస్తున్న తిరుపతయ్య తదితరులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: రహదారి విస్తరణలో భాగంగా ముదినేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పూర్ణచంద్రరావు సోమవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఏర్పడుతుందని సబ్‌స్టేషన్ పరిధిలోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీఏ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠంలో సోమవారం ఎంపీఏ ద్వితీయ సంవత్సరం నాల్గో సెమిస్టర్ నాట్య రస పరిశీలన అనే అంశంపై రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు పరిశీలకులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ చింతా రవి బాలకృష్ణ వ్యవహరించారు. ఈ పరీక్షకు మొత్తం 18 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు బుధవారంతో ముగుస్తాయని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ తెలిపారు.

● ప్రకృతి ప్రసాదం.. ఆరోగ్యానికి వరం



వ్యాపార ధోరణి.. తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించాలనే ఆలోచనలతో ప్రకృతి ప్రసాదించే ప్రతి ఫలంలోను కల్తీ చోటుచేసుకుంటోంది. తాటి ముంజల్లో మాత్రం ఎలాంటి కల్తీ జరిగే ఆస్కారం లేకపోవడంతో స్వచ్ఛంగానే లభిస్తున్నాయి. ఆరోగ్యానికి మేలు చేసే ముంజలు వేసవి సీజన్‌లో మాత్రమే లభిస్తాయి. ముంజలు ఎండలు, ఉష్ణోగ్రత నుంచి ఉపశమనం కలిగిస్తాయి. గతంలో వీటి అమ్మకాలు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమవగా నేడు నగరాలకు విస్తరించాయి.

– పమిడిముక్కల

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



మండవల్లి: భైరవపట్నంలో మే 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే లూర్దుమాత ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఎస్ఐ రామచంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో శాంతి భద్రతలకు విఘాతం లేకుండా చూడాలన్నారు. వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి 12 గంటల తర్వాత షాపులు మూసివేయాలని, వాహనాలు మైనర్లకు ఇవ్వరాదని పేర్కొన్నారు. సర్పంచ్ నీలపాల నాగేంద్రనాథ్, మాజీ సర్పంచ్ బేతపూడి యేసోబురాజు, ఎంపీటీసీ సభ్యుడు ఎన్ కిరీటిరాజు, ఫాదర్ ఎస్ శాంతిరాజు, రత్నకుమార్ మాస్టారు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: పరిశీలన కోసం సర్పంచ్‌కు ఇచ్చిన రికార్డులు తిరిగి అప్పగించకుండా ఇబ్బంది పెడుతున్నట్లు కార్యదర్శి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వైనమిది. మండలంలోని బొమ్మినంపాడు పంచాయతీ పరిధిలో రూ.4.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. ఇందుకు సంబంధించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. దీనికి సంబంధించి ఎంబుక్, ఎస్టిమేషన్ల బుక్, ఇతర రికార్డులు అప్పగించాలంటూ ఈ నెల 22న సర్పంచ్ దారం సుధా కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌ను కోరారు. ఈ రికార్డులను కార్యదర్శి సర్పంచ్‌కి అప్పగించగా పరిశీలన తర్వాత ఇస్తానంటూ రికార్డులను తీసుకెళ్లి ఇప్పటివరకు తనకు అప్పగించలేదంటూ కార్యదర్శి డీటీఓ, డీఎల్పీఓ, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలకు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం రికార్డులు తనవద్దే ఉండాలని సర్పంచ్ వద్ద ఉంటే తనకు సమస్యలు ఎదురవుతాయని, అందుకే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, కథలు చదివించడం, డ్రాయింగ్, క్రాఫ్ట్‌వర్క్ వంటి కార్యక్రమాలు జరిగాయి.

నేడు గంగాభవానీ అమ్మవారి నెల సంబరం

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న గంగాభవానీ అమ్మవారి నెల సంబరాన్ని మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు సోమవారం తెలిపారు. అమ్మవారి ప్రధాన జాతర పూర్తయి నెల రోజుల గడిచిన సందర్భంగా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నెల జాతరను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



రామనపూడి వద్ద జాతీయ రహదారిపై సంచరిస్తున్న పందులు



పంట కాలువపై పందులు పెంచేందుకు ఏర్పాటు చేసిన షెడ్డు

పందుల సంచారంతో బెంబేలు

● రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

గుడివాడరూరల్: పంట కాలువను ఆక్రమించి పందుల పెంపకం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండలంలోని రామనపూడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా పందుల సంచారం చేయడంతో అంటు వ్యాధులకు గురవుతామని అన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని అన్ని వీధులు, డ్రైయినేజీలు, పంటబోదెల్లో బొర్లుతున్నాయి. పందులు కొన్ని తమ ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయని మహిళలు వాపోతున్నారు.

ద్విచక్రవాహనదారులకు ఇక్కట్లు

పామర్రు జాతీయ రహదారి సమీపంలో ఉన్న రామనపూడిలో విచ్చలవిడిగా పందుల తిరుగుతుండడంతో రహదారిపై ద్విచక్ర వాహనచోదకులు పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటి వరకు పందుల వల్ల 10 నుంచి 15 మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలయ్యారు. సోమవారం కూడా ఓ యువకుడు పందుల వల్ల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పందులతో ఇబ్బందులు

మా గ్రామంలో విచ్చలవిడిగా పందులు తిరుగుతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లల్లోకి కూడా పందులు వచ్చి అపరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పందుల సంచారాన్ని అరికట్టాలి.

– సుబ్బారావు, రామనపూడి గ్రామస్తుడు

● వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా దేశిరెడ్డి



వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా నియమితులైన దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డిని పార్టీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, కృష్ణా జిల్లా జనరల్ సెక్రెటరీ కందుల నాగరాజు, ఎంపీపీ పెయ్యల ఆదాం తదితరులు సోమవారం సత్కరించారు.

– నందివాడ

వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు



పామర్రు గ్రంథాలయంలో వేసిన డ్రాయింగ్‌ను చూపుతున్న విద్యార్థులు



అంగలూరులో వేసవి శిబిరాన్ని ప్రారంభించిన గ్రంథాలయాధికారి పద్మజ

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు చేకూరుతుందని గ్రంథాలయాధికారి పి.వి.వి.పద్మజ అన్నారు. సోమవారం నుంచి అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇచ్చిన వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకునేందుకు విజ్ఞాన సముపార్జనే ధ్యేయంగా ప్రభుత్వం ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పామర్రులో..

జమీగొల్వేపల్లి(పామర్రు): జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, యోగా గురువు పొట్లూరి వెంకట ధర్మారావు, విశ్రాంత ఉద్యోగి సీహెచ్ కృష్ణమోహన్‌రావు హాజరయ్యారు. తొలుత గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి నాగ సురేష్ పాల్గొన్నారు. పామర్రులోని ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి ఎం ఝాన్సీ రాణి తెలిపారు. విద్యార్థులతో కథలు చదివించడంతోపాటు డ్రాయింగ్ వేయించినట్లు పేర్కొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా విలసిల్లుతున్నాయని తహసీల్దార్ రామకృష్ణ పేర్కొన్నారు. కలిదిండి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో పుస్తక పఠనాన్ని అందరూ అలవర్చుకోవాలన్నారు. సెల్ ఫోన్లకు చిన్నపిల్లలు దూరంగా ఉండాలన్నారు. గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు మాట్లాడుతూ రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జెడ్పీహెచ్ ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ జి.లక్ష్మణస్వామి, కలిదిండి పబ్లిక్ స్కూల్ వ్యాయామోపాధ్యాయుడు సన్నీ బాబు పాల్గొన్నారు.



కలిదిండి శాఖా గ్రంథాలయం వద్ద చిన్నారులతో తహసీల్దారు రామకృష్ణ

ఉపాధి కూలీలు ఐక్యంగా పోరాడాలి

నందివాడ: ఉపాధి హామీ కూలీలు తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పరిరక్షణ యాత్రలో భాగంగా నందివాడ మండలం ఇలపర్రు శివారు లక్ష్మీనరసింహాపురంలో సోమవారం ఉపాధి కూలీలతో నాయకులు మాట్లాడారు. ఉపాధి నిధుల్లో కేంద్ర ప్రభుత్వం కోత విధిస్తోందన్నారు. ఉపాధి కూలీలంతా ఐక్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సబ్సిడీ రుణాలకు సిబిల్ స్కోర్ అడ్డంకి

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మంజూరులో సిబిల్ స్కోర్ అడ్డంకిగా మారిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి తాళ్లూరి ప్రశాంత్ పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా అందజేస్తున్న రుణాలు పేద, మధ్య తరగతుల నిరుద్యోగ యువతకు ఉపశమనం కలిగిస్తాయని తెలిపారు. బ్యాంకులు సిబిల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుని రుణాలు మంజూరు చేయకపోవడంతో అనేక మంది రుణాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లో చెప్పుల తయారీ యూనిట్‌కు రుణం మంజూరు లేకపోవడం విచారకరని తెలిపారు. ప్రభుత్వాధికారులు బ్యాంకు అధికారులతో సంప్రదించి రుణాలు సులువైనమార్గంలో లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు

ముదినేపల్లి రూరల్: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే పెద్దలపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వీరభద్రరావు హెచ్చరించారు. సోమవారం ముదినేపల్లిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మండవల్లి మండలం అల్లినగరం గ్రామానికి చెందిన మైనర్ ద్విచక్ర వాహనం నడుపుతుండగా అతడిని అదుపులోకి తీసుకుని మైనర్ తండ్రిపై కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

మండలంలోని కాకరవాడ పంటకాలువ గట్టుపై పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

కృత్తివెన్ను: పర్యావరణ సమతుల్యత కాపాడాలంటే ప్రతి గ్రామంలోనూ మొక్కలను విరివిగా పెంచాలని ఉపాధి హామీ మచిలీపట్నం క్లస్టర్ ఏపీడీ నాగసురేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానవశాఖ, అగ్రికల్చరల్, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్టీకల్చరల్ ప్రాజెక్టులో భాగంగా ఉపాధి హామీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మామిడి, వేప, జామ మొక్కల పెంపకానికి రైతులను గుర్తించాలన్నారు.